# ఆంధ్రప్రదేశ్ సూక్ష్మరుణసంస్థలు (రుణ వితరణ నియంత్రణ)

# ఆర్డినెన్స్ 2010లోని ముఖ్యమైన నిబంధనలు

## ఆంధ్రప్రదేశ్ రాజపత్రము నం.9/2010

## "ఆంధ్రప్రదేశ్ సూక్ష్మరుణసంస్థలు (రుణవితరణ నియంత్రణ) ఆర్డినెన్స్ - 2010"

## ఆంధ్రప్రదేశ్ సూక్ష్మ రుణసంస్థల (రుణ వితరణ నియంత్రణ) నిబంధనావళి : 2010

---

గ్రామీణాభివృద్ధిశాఖ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం

గ్రామీణ పేదరిక నిర్మూలనా సంస్థ

# ఆంధ్రప్రదేశ్ సూక్ష్మరుణసంస్థలు (రుణ వితరణ నియంత్రణ) ఆర్డినెన్స్ 2010లోని ముఖ్యమైన నిబంధనలు

సూక్ష్మరుణసంస్థల అధిక వడ్డీల వేధింపులనుంచి, బలవంతపు వసూళ్ల నుంచి స్వయం సహాయక సంఘాల సభ్యులను రక్షించడం కోసం మన రాష్ట్ర ప్రభుత్వం "ఆంధ్రప్రదేశ్ సూక్ష్మరుణసంస్థల (రుణ వితరణపై నియంత్రణ) ఆర్డినెన్స్ (2010)" తెచ్చింది.

ఈ ఆర్డినెన్స్ సూక్ష్మరుణసంస్థల అప్పుల వలయంలో చిక్కుకున్న స్వయం సహాయక సంఘాలకు ఆ సంఘాల సభ్యులకు వారి కుటుంబాలకు రక్షణగా నిలుస్తుంది. సూక్ష్మరుణసంస్థల ఆగడాలనించి మిమ్మల్ని కాపాడుతుంది. ఈ సందర్భాలలో...

## ▶ స్వయంసహాయక సంఘాల సభ్యులు పాటించవలసిన పద్ధతులు

- స్వయం సహాయక సంఘాల సభ్యులు ఒక్క సంఘంలోనే సభ్యత్వం కలిగి ఉండాలి. ఒకటి కంటే ఎక్కువ సంఘాల్లో సభ్యత్వం కలిగిన వారు మూడునెలల్లోగా ఏ సంఘంలో ఉండాలో నిర్ణయించేసుకోవాలి. వద్దనుకొన్న స్వయం సహాయక సంఘం వారికి కట్టవలసిన బకాయిలు లెక్కచేయమని అడగాలి. ఆ సంస్థలో తన సభ్యత్వాన్ని రద్దు చేసుకొంటున్నట్లు తెలియ జేయాలి.
- స్వయం సహాయక సంఘాల నాయకులు, సభ్యులు సూక్ష్మరుణ సంస్థల ఏజంట్లుగా వ్యవహరించకూడదు.
- గ్రూపులో రుణం కట్టలేని వారిని సూక్ష్మరుణసంస్థల తరఫున బలవంతంగా కట్టించడానికి ప్రయత్నించకూడదు. తోటి సభ్యులు వారి కుటుంబాలపై ఏరకమైన వత్తిడి తెచ్చినా, వారిని దూషించినా, అవమానకరంగా ప్రవర్తించినా ఈ ఆర్డినెన్స్ క్రింద శిక్షార్హమైన నేరమవుతుంది. పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదుచేయాలి.
- సూక్ష్మరుణసంస్థ వలన ఏదైనా అన్యాయం జరిగినట్లయితే వెంటనే గ్రామీణాభివృద్ధిశాఖ ప్రాజెక్టు డైరెక్టరు గారికి, మెప్మా ప్రాజెక్టు డైరెక్టరుగారికి ఫిర్యాదు చేయాలి.
- వివాదాల పరిష్కారానికి ఫాస్ట్‌ట్రాక్ కోర్టును ఆశ్రయించవచ్చును.

## ▶ రుణాల మంజూరి

- సూక్ష్మరుణసంస్థలన్ని ప్రతి జిల్లాలో ప్రాజెక్టు డైరెక్టరు వద్ద నమోదు చేయించుకోవాలి. గ్రామంలో ఎవరైనా అప్పుఇస్తామని వస్తే నమోదు చేయించుకొన్నారో లేదో తెలుసుకోవాలి. నమోదు సర్టిఫికెట్ చూపించమని అడగాలి. సూక్ష్మరుణసంస్థ రుణం ఇవ్వబోయే ముందు నమోదు అధికారి వద్ద ముందస్తు అనుమతి తీసుకోవాలి.
- ఎవరైనా సభ్యురాలికి ఇప్పటికే రెండు రుణాలు ఉన్నట్లయితే మరో రుణం ఇవ్వరాదు.

## ▶ వడ్డీ రేట్లు

❖ సూక్ష్మరుణసంస్థల వడ్డీరేట్లను తమ కార్యాలయాలలో ప్రముఖంగా ప్రదర్శించాలి.

❖ వడ్డీ రేట్లను రుణగ్రహీతకు రాతపూర్వకంగా తెలియజేయాలి.

❖ తరుగుతున్న అప్పునిల్వపై వడ్డీ కట్టే విధానంలోనే వడ్డీని లెక్కించాలి. అంటే ఏ నెలకు ఆనెల కట్టిన అసలు మొత్తాన్ని మినహాయించి మిగిలిన అసలు మొత్తం పైననే వడ్డీ లెక్కకట్టాలి.

❖ వడ్డీ అసలును మించకూడదు.

❖ వడ్డీ తప్ప సర్వీసుచార్జీ, అప్లికేషన్ ఫీజు, రికవరీఫీజు, పొదుపు, ఇన్సూరెన్స్ వంటి రూపాలలో అదనపు వసూళ్ళు చేయరాదు. అలా వసూలు చేస్తే చట్టప్రకారం శిక్ష తప్పనిసరి.

❖ దినసరి, వారం వారం వాయిదాలలో అప్పులను వసూలు చేయరాదు. కనీసం నెలసరి వాయిదాకు తగ్గకుండా అప్పులు వసూలు చేయాలి.

❖ రుణ గ్రహీతకు ప్రతి చెల్లింపునకు రశీదు ఇవ్వాలి, అకౌంట్ స్టేట్‌మెంట్ (ఖాతాపత్రం) ఉచితంగా అందజేయాలి.

## ▶ వసూళ్ళు

❖ సూక్ష్మరుణసంస్థలు బలవంతపు వసూళ్ళకు పాల్పడరాదు. బలవంతపు వసూళ్ళు అనగా...

❖ బెదిరించి భయపెట్టి అప్పులు వసూలు చేయరాదు.

❖ అదే పనిగా రుణగ్రహీతల వెంటపడటం వారు ఎక్కడికి వెళితే అక్కడకు వారి పని ప్రదేశాలకు, వ్యాపార ప్రదేశాలకు నివాస ప్రదేశాలకు బంధుమిత్రుల ఇళ్లకు వెళ్లడం. వారికి సంబంధించిన ఆస్తులతో జోక్యం చేసుకోవడం ఇళ్లకు తాళాలు వేయడం, ఇళ్లల్లో వస్తువులను స్వాధీనంచేసుకొని వేలంవేయడం, లేదా అమ్మడం లేదా తాకట్టు పెట్టించడం చేయరాదు.

❖ రుణగ్రహీత ఇంటికి తరుచుగా రుణం వసూలు కోసం వెళ్లడం సమయాసమయాలు పాటించకపోవడం వేదింపుల క్రిందికి వస్తుంది.

❖ సూక్ష్మరుణసంస్థలు వసూలు ఏజంట్లను నియమించుకోరాదు. అనుమతి పొందని వ్యక్తుల ద్వారా బలవంతపు వసూళ్లకు పాల్పడుతున్న సంస్థలపై చట్టప్రకారం చర్యవుంటుంది. సంఘాల సభ్యులు ఈ విషయంపై ఫిర్యాదు చేయాలి.

❖ వసూలుకి వచ్చినవారిని సూక్ష్మరుణసంస్థ ఉద్యోగి అవునో కాదో తెలుసుకోవడానికి గుర్తింపుకార్డు, సంస్థ నమోదు పత్రం మొదలగునవి చూపమని అడగవచ్చు. నమోదు చేయించుకోకుండా సూక్ష్మరుణసంస్థలు వ్యాపారం సాగిస్తే మూడేళ్ళు జైలు, జరిమానా శిక్షకు అర్హులు.

- పంచాయితీ కార్యాలయాల్లో, పట్టణాల్లో అయితే పట్టణ సమాఖ్య కార్యాలయాల్లో వార్డు ఆఫీసుల వంటి ప్రజా స్థలాల్లోనే రుణాల చెల్లింపు జరగాలి.
- సూక్ష్మరుణ సంస్థలు నమోదు చేయించుకోకుండా వ్యాపారం చేసినా, అధిక వడ్డీలు వసూలు చేసినా, బలవంతపు వసూలు చేసినా, అనుమతి లేని రుణాలు మంజూరు చేసినా, వసూలు ఏజంట్లను పెట్టినా, ఇచ్చిన రుణాలకు తాకట్టుపెట్టుకున్నా, సెక్యూరిటీలు పెట్టుకున్నా ప్రభుత్వ ఉత్తర్వులను ఉల్లంఘించినట్లే అవుతుంది. ఉత్తర్వుల ప్రకారం శిక్షార్హులు.
- అప్పుకు సెక్యూరిటీగా పట్టాపుస్తకం, రేషన్‌కార్డు, భీమా పత్రాలు, ఇతర కుటుంబసభ్యుల నుంచి ఖాళీ చెక్కులపై సంతకాలు చేయించి తీసుకెళ్లడం వంటివేకాక మరే ఇతరమైన సెక్యూరిటీలను తీసుకోరాదు.
- అసలుకి రెట్టింపు సొమ్ము వసూలు చేసినట్లయితే అలాంటి రుణాలు రద్దవుతాయి. ఎక్కువగా వసూలు చేసిన మొత్తాన్ని సూక్ష్మరుణసంస్థ రుణగ్రహీతకు వాపస్ చేయాలి.

## ▶ ఆర్డినెన్స్ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టరీత్యా తీసుకునే చర్యలు

- రిజిస్ట్రేషన్ చేసుకోకుండా కార్యకలాపాలు నిర్వహించిన సూక్ష్మరుణ సంస్థల వారిపై 3 సంవత్సరాల వరకు కారాగారా శిక్ష లక్ష రూపాయల వరకు జరిమానా విధించబడును.
- ఆర్డినెన్స్‌లోని మిగితా నిబంధనలను ఉల్లంఘించిన వారికి ఆరు నెలలు జైలు శిక్ష మరియు / లేదా పదివేల రూపాయల వరకు జరిమానా విధించబడును.
- సంఘాలకు మరియు సూక్ష్మరుణ సంస్థలకు మధ్య తలెత్తిన వివాదాలను పరిష్కరించుటకు ఫాస్ట్‌ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేయబడుతాయి. ఫాస్ట్‌ట్రాక్ కోర్టుల ముందుకు వచ్చిన వివాదాలు మూడు నెలల్లోగా పరిష్కరించబడుతాయి.
- ఏదైనా స్వయం సహాయక సంఘం కాని వారి సభ్యులు కాని ఏదైనా సూక్ష్మ రుణ సంస్థ ఆర్డినెన్స్‌లోని నిబంధనలను ఉల్లంఘించినట్లయితే రిజిస్ట్రేషన్ అథారిటీకి ఫిర్యాదు చేయాలి. సూక్ష్మరుణ సంస్థలపై చేయవలసిన ఫిర్యాదులు వ్రాత పూర్వకముగా ఇవ్వాలి. లేదంటే టోల్ ఫ్రీ టెలిఫోన్ నెం. **155321**కి కూడా ఫోన్ చేయవచ్చును.

కావున మండల సమాఖ్యలు గ్రామైఖ్య సంఘాలు స్వయం సహాయక సంఘాలలోని నాయకులంతా తమతమ సమాఖ్యల్లో సంఘాలలోని సభ్యులందరికి ఆర్డినెన్స్‌లోని అంశాలను తెలియజేసి సూక్ష్మరుణ సంస్థల బారిన పడకుండా వారిని చైతన్య పరచవలసినదిగా కోరుతున్నాను.

**ముఖ్య కార్యదర్శి**
**గ్రామీణాభివృద్ధి శాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం**

# ఆంధ్రప్రదేశ్ రాజపత్రము

**ఆంధ్రప్రదేశ్ గెజిట్**

**పార్ట్ 4 - బి అసాధారణ పత్రం**

**అధికృత అధికారిచే ప్రచురితం**

**నం.22, హైదరాబాద్, శుక్రవారం, అక్టోబర్ 15,2010**


## ఆంధ్రప్రదేశ్ చట్టాలు, ఆర్డినెన్స్‌లు మరియు నియంత్రణలు

భారత రాజ్యాంగం 348(3) అధికరణ సార్వత్రిక సమాచారం పరిధిలో 15 అక్టోబర్ 2010న గవర్నర్ ఆంగ్లభాషలో జారీ చేసిన ఆర్డినెన్స్ అనువాద ప్రతి.

## ఆంధ్రప్రదేశ్ ఆర్డినెన్స్ నం.9/2010

భారత రిపబ్లిక్ 61వ సంవత్సరంలో గవర్నర్ ప్రకటించినది.

ఆంధ్రప్రదేశ్‌లోని సూక్ష్మరుణసంస్థల దోపిడి మరియు దానికి సంబంధించిన విషయాలు, ఘటనల నుంచి స్వయం సహాయక సంఘాల మహిళల రక్షణకు జారీచేసిన ఆర్డినెన్స్.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం దారిద్ర్యరేఖకు దిగువన జీవనం సాగిస్తున్న కుటుంబాల్లోని మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించేందుకు వారిని స్వయం సహాయక సంఘాలుగా (ఎస్‌హెచ్‌జిలు) ఏర్పాటుచేసి, వాటిని బ్యాంకులకు అనుసంధానం చేయడం ద్వారా ఆర్థిక కార్యకలాపాల్లో భాగస్వాములను చేసేందుకు చేస్తున్న ప్రయత్నంలో భాగంగా...

సూక్ష్మరుణసంస్థలు స్వయం సహాయక సంఘాలకు అధిక వడ్డీలకు రుణాలు కల్పిస్తూ వేధింపుల ద్వారా వసూళ్ళుచేస్తూ, వారిని మరింత దారిద్ర్యంలోకి నెడుతుండటంవలన, ఫలితంగా కొన్ని సందర్భాల్లో రుణగ్రహీతలు ఆత్మహత్యలకు పాల్పడుతున్నందున, సూక్ష్మరుణసంస్థల రుణాల వలన తీవ్ర ఇక్కట్లకు గురి అవుతున్న స్వయం సహాయక సంఘాలను వాటి నుండి విముక్తి చేసేందుకు మరియు వాటి ప్రయోజనాలను పరిరక్షించేందుకు...

ఆంధ్రప్రదేశ్ శాసనసభ సమావేశాలు ప్రస్తుతం లేనందువల్ల రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులు తాను తక్షణం జోక్యం చేసుకోవలసినవిగా ఉన్నాయని గవర్నర్ సంతృప్తి చెందినందుకు...

ప్రస్తుతం, భారత రాజ్యాంగంలోని 213వ అధికరణం క్లాజ్ (1) క్రింద తనకు సంక్రమించిన అధికారాలను ఉపయోగించుకొని గవర్నర్ దిగువ ఆర్డినెన్స్ జారీ చేశారు.

సంక్షిప్త నామం, పరిధి, ప్రారంభం

**1.** 1. ఈ ఆర్డినెన్స్‌ను **"ఆంధ్రప్రదేశ్ సూక్ష్మరుణసంస్థలు (రుణవితరణ నియంత్రణ) ఆర్డినెన్స్ - 2010"**గా వ్యవహరిస్తారు.

2. ఇది ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అంతటికి వర్తిస్తుంది.

3. ఇది తక్షణం అమలులోకి వస్తుంది.

4. ఈ ఆర్డినెన్స్ జారీకి ముందు, ఏర్పాటైన తర్వాత ఏర్పాటు కాబోయే సూక్ష్మరుణసంస్థలన్ని దీని పరిధిలోకి వస్తాయి.

నిర్వచనాలు

**2.** ఈ ఆర్డినెన్స్‌లో, సందర్భం ప్రకారం

ఎ. 'ప్రభుత్వం' అంటే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం;

బి. 'వడ్డీ' అంటే ఆర్డినెన్స్‌లో పేర్కొన్న అంశాలను బట్టి స్వయం సహాయక సంఘానికి సూక్ష్మరుణసంస్థ ఇచ్చే రుణాలపై వచ్చే ఆదాయం.

సి. 'రుణం' అంటే ధనరూపంలోగాని, వస్తురూపంలోగాని స్వయం సహాయక సంఘానికి నిర్ధిష్టవడ్డీ రేటుకి ఇచ్చిన సొమ్ము, ఈ ఆర్డినెన్స్ జారీకి ముందుగాని, తర్వాతగాని ఇచ్చిన రుణం దీని పరిధిలోకి వస్తాయి. స్వయం సహాయక సంఘానికి డబ్బు రూపంలోగాని, వస్తురూపంలోగాని ఇచ్చిన రుణానికి, స్వయం సహాయక సంఘానికి నేరుగా ఇచ్చిన రుణాలు, రాయితీలు, చెల్లించిన సొమ్ము లేదా ఆ సంఘం తరపున, ఆ సంఘంలోని ఏ వ్యక్తి అభ్యర్థన మేరకైనా, ఏ వ్యక్తి ఖాతాలోనైనా జమచేసిన సొమ్ముకు ఇది వర్తిస్తుంది. ఇటువంటి రుణాల చెల్లింపుకి సంబంధించిన ఒప్పందాలన్నింటికి ఈ నిర్వచనం వర్తిస్తుంది.

డి. సూక్ష్మరుణసంస్థ అనగా (ఎంఎఫ్ఐ) ఒక వ్యక్తి, భాగస్వామ్య సంస్థ, కొందరు వ్యక్తుల సమూహం, 1956 కంపెనీల చట్టం క్రింద నమోదైన కంపెనీలు, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చట్టం-1934 లో నిర్వచించిన బ్యాంకింగ్ యేతర ఫైనాన్స్ కంపెనీలు, ఆంధ్రప్రదేశ్ సహకార సంఘాలచట్టం-1964 క్రింద రిజిస్టర్ అయిన సొసైటీలు, ఆంధ్రప్రదేశ్ సొసైటీల రిజిస్ట్రేషన్ చట్టం-2001 క్రింద రిజిస్టర్ అయిన సొసైటీలు సూక్ష్మరుణ సంస్థలుగా పిలువబడతాయి.

వీటితో పాటు అల్పాదాయ వర్గాలకు చెందిన ప్రజలకు రుణాలివ్వడం ద్వారా ఆర్థిక మద్దతు అందించటమే ఒక ప్రధాన కార్యకలాపంగా లేదా ఇది కూడా ఒక పనిగా పనిచేస్తున్న సంస్థలు అన్ని ఈ నిర్వచనం పరిధిలోకి వస్తాయి.

ఇ. "నోటిఫికేషన్' అంటే ఆంధ్రప్రదేశ్ గెజిట్‌లో ప్రచురించిన నోటిఫికేషన్లు. 'నోటిఫైడ్' పదాన్ని కూడా ఇందుకు అనుగుణంగానే పరిగణించాలి.

ఎఫ్. 'నిర్దేశిత' అంటే ఆర్డినెన్స్‌లోని నిబంధనల క్రింద పొందుపరిచిన అంశాలు.

జి. 'రిజిష్టరింగ్ అథారిటి' అంటే ప్రాజెక్టు డైరెక్టర్, గ్రామీణ ప్రాంతాల కోసం ఏర్పాటైన జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్, పట్టణ ప్రాంతాల కోసం ఏర్పాటైన ఎం.ఇ.పి.ఎం.ఏ (మెప్మా) ప్రాజెక్టు డైరెక్టర్, లేదా ఈ ఆర్డినెన్స్ పరిధిలో ఆ జిల్లాలో రిజిస్ట్రింగ్ అథారిటీగా పనిచేసేందుకు ఆ జిల్లా కలెక్టరుచే నియమితులైన అధికారి ఎవరైనా రిజిస్ట్రింగ్ అథారిటీగా ఉంటారు.

హెచ్. 'రిజిస్ట్రేషన్' అంటే ఈ ఆర్డినెన్స్ క్రింద ఒక సూక్ష్మరుణసంస్థకు (ఎం.ఎఫ్.ఐ) మంజూరు చేసిన నమోదు పత్రం.

ఐ. 'స్వయం సహాయక సంఘం (ఎస్‌హెచ్‌జి)' అంటే స్వయం సహాయక సూత్రాల ఆధారంగా, గ్రామీణ ప్రాంతాల్లో అయితే గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) వద్ద నమోదైన స్వయం సహాయక సంఘాల్లో, పట్టణ ప్రాంతాల్లో అయితే పట్టణ ప్రాంతాల పేదరిక నిర్మూలన సంస్థ (ఎం.ఇ.పి.ఎం.ఎ) వద్ద నమోదైన మహిళా బృందాలు.

జె. 'ఎస్‌హెచ్‌జి బ్యాంక్ లింకేజి' అంటే స్వయం సహాయక సంఘాలు ఆర్థిక కార్యకలాపాలను నిర్వహించుకునేందుకు రూపొందించిన సూక్ష్మరుణ ప్రణాళిక ఆధారంగా వాణిజ్య బ్యాంకులు స్వయం సహాయక సంఘాలకు రుణసహాయం అందించడం.

కె. 'ఎస్‌హెచ్‌జి సభ్యురాలు' అంటే స్వయంసహాయక సంఘంలో సభ్యత్వం కలిగిన వ్యక్తి. ఆ స్వయం సహాయక సంఘం ద్వారా రుణం పొందడం లక్ష్యంగా కలిగిన వ్యక్తి, అంటే ఈ ఆర్డినెన్స్ పరిధిలోకి వచ్చే రుణ గ్రహీత.

ఎల్. 'గ్రామీణ పేదరిక నిర్మూలనా సంస్థ (సెర్ప్)' అంటే గ్రామీణ ప్రాంతాల్లో పేదరిక నిర్మూలన కార్యక్రమాలు చేపట్టడం కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన సొసైటీ.

ఎం. "పట్టణ పేదరిక నిర్మూలనా కార్యక్రమం" (మెప్మా) అంటే మునిసిపాలిటీ ప్రాంతాలలో పేదరికాన్ని నిర్మూలించేందకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించడానికి ప్రభుత్వం ఏర్పాటు చేసిన పట్టణ పేదరిక నిర్మూలనా సంస్థ.

సూక్ష్మ రుణ సంస్థల రిజిస్ట్రేషన్

ఎన్. ఈ అర్డినెన్స్‌లో ఉపయోగించిన ఇతర పదాలను, నిర్వచించక పోయినప్పటికి ఆ పదాలకు ఇతర సంబంధిత చట్టాల్లో నిర్దేశించిన అర్థాలే వర్తిస్తాయి.

**3.** (1) ఆంధ్రప్రదేశ్‌లో కార్యకలాపాలు సాగిస్తున్న సూక్ష్మ రుణసంస్థలన్నీ ఈ ఆర్డినెన్స్ జారీ అయిన తేదీ నుంచి 30 రోజుల లోపు రిజిస్ట్రేషన్ కోసం తాము పనిచేస్తున్న జిల్లాలో రిజిస్టరింగ్ అధారిటి వద్ద దరఖాస్తు చేసుకోవాలి. తాము ఏ గ్రామాలు, పట్టణాలలో ఏ ప్రయోజనంతో కార్యకలాపాలు నిర్వహిస్తున్నదో తెలియచేయాలి. సంస్థ అమలు చేస్తున్న వడ్డీరేటు, లేదా అమలుచేయాలనుకుంటున్న వడ్డీ రేటును, ఏ ప్రయోజనం కోసం రుణం ఇస్తున్నారో, రుణాల వసూళ్ళ విధానం, సంస్థ కార్యకలాపాలను నిర్వహించటానికి నియమితులైన వ్యక్తులు మరియు రుణాల మంజూరు, వసూళ్ళ నిమిత్తం నియమితులైన వ్యక్తుల జాబితా తెలియజేస్తూ రిజిస్ట్రేషన్‌కు దరఖాస్తుచేయాలి.

(2) ఈ అర్డినెన్స్ అమలులోకి వచ్చేటప్పటికి పని చేస్తున్న లేదా స్వయం సహాయకసంఘాలకు రుణాలిచ్చే వ్యాపారం ప్రారంభించాలనకునే సూక్ష్మ రుణసంస్థలు అన్నీ కూడా ఈ అర్డినెన్స్ ప్రకారం సంబంధిత రిజిస్ట్రింగ్ అధారిటి వద్ద రిజిస్టర్ చేసుకోకుండా రుణాలు మంజూరు చేయరాదు, లేదా రుణాలు వసూలు చేయరాదు.

సూక్ష్మ రుణ సంస్థల రిజిస్ట్రేషన్

(3) రిజిస్టరింగ్ అధారిటి తన వద్ద దరఖాస్తు చేసుకున్న సూక్ష్మరుణసంస్థ వివరాలన్నింటినీ సమగ్రంగా తనిఖీచేసి, ఈ ఆర్డినెన్స్‌లోని నిబంధనల ప్రకారమే ఒక సంవత్సరానికి సూక్ష్మరుణసంస్థ కార్యకలాపాలు నిర్వహించుకునేందుకు అనుమతి ఇవ్వాలి. ఇట్టి అనుమతి ఆర్డినెన్స్‌లో పేర్కొన్న విధంగా పూచీకత్తు పత్రం సమర్పించిన తర్వాతే ఇవ్వాలి.

సూక్ష్మ రుణ సంస్థలు రిజిస్ట్రేషన్ పొందడం

(4) ఏడాది కాల వ్యవధి ముగియడానికి 60 రోజుల ముందుగా రిజిస్ట్రేషన్ కొనసాగింపునకు సూక్ష్మరుణసంస్థలు పైన పేర్కొన్న విధంగా సబ్ సెక్షన్ (3) పరిధిలోనే దరఖాస్తు చేసుకోవాలి. క్షేత్రస్థాయిలో సూక్ష్మరుణసంస్థల పనితీరును తగిన విధంగా తనిఖీ చేసిన అనంతరం, ప్రజల నుంచి క్షేత్రస్థాయిలో రిజిస్ట్రేషన్ కొనసాగింపునకు సంబంధించి ఫిర్యాదులేమైనా వస్తే వాటిపై విచారణ చేసిన తర్వాత 15 రోజులలోపు అనుమతి మంజూరు చేయవచ్చు లేదా తిరస్కరించవచ్చును.

**4.** (1) ప్రతి రిజిస్టరింగ్ అధారిటీ తన పరిధిలోకి వచ్చే ప్రాంతాల్లో కార్యకలాపాలు సాగిస్తున్న అన్ని సూక్ష్మరుణసంస్థలకు చెందిన వివరాలతో నిర్ధేశిత విధానంలో రిజిస్టర్ నిర్వహించాలి.

(2) సబ్‌సెక్షన్ (1) క్రింద తాను నిర్వహిస్తున్న రిజిస్టర్‌లోని సూక్ష్మరుణసంస్థల వివరాలను నిర్దేశిత కాలవ్యవధిలో నిర్ధేశిత విధానంలో ప్రచురించాలి.

5. (1) రిజిస్టరింగ్ అథారిటీ తనంత తానుగా గాని లేదా స్వయం సహాయక సంఘాల ద్వారా లేదా స్వయం సహాయక సంఘాల సభ్యుల ద్వారా, ప్రజల ద్వారా వచ్చిన ఫిర్యాదుల ఆధారంగా తగినన్ని కారణాలు చూపుతూ సూక్ష్మరుణసంస్థల రిజిస్ట్రేషన్ రద్దు చేయవచ్చును.

**స్వయం సహాయక సంఘం సభ్యురాలు ఒక్క సంఘంలోనే సభ్యత్వం కలిగి ఉండాలి.**

అయితే సంబంధిత సూక్ష్మరుణసంస్థపై చర్య తీసుకోవడానికి తగినన్ని అధారాలున్నాయంటూ నోటీసు జారీ చేయకుండా ఎలాంటి రిజిస్ట్రేషన్ రద్దు ఆదేశాలు జారీ చేయకూడదు. ఆ నోటీసులోని అభియోగాలపై వివరణ ఇచ్చుకునేందుకు తగినంత అవకాశం కూడా ఆ సూక్ష్మరుణసంస్థకు ఇవ్వాలి.

**వివరణ :** ఏదైనా సూక్ష్మరుణసంస్థ ఆర్డినెన్స్‌లోని నిబంధనల ఉల్లంఘనకు పాల్పడినట్టయితే ఆసంస్థ రిజిస్ట్రేషన్‌ను సస్పెన్షన్‌లో ఉంచడానికి లేదా రద్దుచేయడానికి సబ్ సెక్షన్ (1) కింద ఆధికారం ఉంది.

(2) సబ్ సెక్షన్ (1) కింద దర్యాప్తు జరుగుతున్న సందర్భంలో, రిజిస్టరింగ్ అధికారి తగినన్ని కారణాలు చూపుతూ సూక్ష్మరుణసంస్థ రిజిస్ట్రేషన్‌ను సస్పెండ్ చేయవచ్చును.

6. స్వయం సహాయక సంఘాలలో సభ్యులు ఎవరూ ఒకటికి మించి స్వయం సహాయక సంఘాల్లో సభ్యత్వం కలిగి ఉండరాదు. ఈ ఆర్డినెన్స్ జారీకి ముందు ఎవరైనా ఒకటికన్నా ఎక్కువ స్వయం సహాయక సంఘాల్లో సభ్యత్వం కలిగి ఉంటే ఏదో ఒక స్వయం సహాయక సంఘంలో సభ్యత్వాన్ని ఉంచుకుని మిగతా స్వయం సహాయక సంఘాల్లో సభ్యత్వాన్ని రద్దుచేసుకునే స్వేచ్ఛ ఉంటుంది. ఇందుకోసం ఏ సంఘాల్లో సభ్యత్వాన్ని వదులుకోవాలను కుంటుందో ఆ సంఘాలకు తన సభ్యత్వాన్ని రద్దుచేసుకుంటున్నట్టుగా నోటీసు పంపాలి. సంఘం ద్వారా రుణం ఇచ్చిన సూక్ష్మరుణసంస్థకి చెల్లించాల్సిన బకాయిలు ఏమైనా ఉంటే తెలియచేయాలని, తన లెక్కలు సెటిల్ చేయాలని కోరవచ్చును. అర్డినెన్స్ జారీ అయిన తేదీ నుంచి మూడు నెలల్లోగా ఈ నోటీసు ఇవ్వాల్సి ఉంటుంది.

**సూక్ష్మరుణ సంస్థ రుణాలపై ఎలాంటి సెక్యూరిటీ అడగకూడదు**

7. సూక్ష్మరుణసంస్థ కూడా తాను ఇచ్చిన రుణానికి, రుణ గ్రహీత నుంచి తాకట్టు రూపంలోగాని, ప్రతిజ్ఞ రూపంలోగాని ఎలాంటి సెక్యూరిటీ అడగ కూడదు. ఈ ఆర్డినెన్స్ జారీకి ముందు ఎవరైనా అలాంటి సెక్యూరిటీ సమర్పించి ఉంటే వెనువెంటనే దాన్ని రుణగ్రహీతకు విడుదల చేయాల్సి ఉంటుంది.

**సూక్ష్మరుణ సంస్థ రుణాల తన వడ్డీ రేట్లను ప్రదర్శించాలి.**

రుణాలపై తీసుకోగల్గిన వడ్డీ మరియు కొన్ని కేసుల్లో రుణాలపై తిరిగి చెల్లించ వలసినవి

**8.** (1) సూక్ష్మరుణసంస్థలన్ని తాము వసూలు చేస్తున్న వడ్డీరేట్లను తమ ప్రాంగణంలోని ప్రధాన ప్రదేశాలలో ప్రముఖంగా అందరికీ కనిపించే విధంగా పెద్ద పెద్ద అక్షరాల్లో ప్రచురించాల్సి ఉంటుంది.

(2) సూక్ష్మరుణసంస్థ రుణంమంజూరుకు సంబంధించిన దరఖాస్తుల్లో సమర్పించిన చార్జీలను మించి ఎలాంటి మొత్తాన్ని రుణ గ్రహీత నుంచి వసూలు చేయకూడదు.

**9.** (1) ఏ సూక్ష్మరుణసంస్థ కూడా ఈ అర్డినెన్స్ జారీకి ముందుకాని, తర్వాతకాని ఇచ్చిన రుణాలపై రుణగ్రహీతల నుంచి అదనపు వడ్డీ వసూలు చేయరాదు. తాము ఇచ్చిన అసలు మొత్తానికి మించి అదనంగా ఏ సొమ్ము వసూలు చేయకూడదు.

(2) ఈ ఆర్డినెన్స్ జారీకి ముందుగాని తర్వాతగాని సూక్ష్మరుణసంస్థలు రుణ గ్రహీతల నుంచి అసలు మొత్తానికి రెట్టింపు సొమ్ము వసూలు చేసి ఉంటే అలా అధికంగా చెల్లించిన మొత్తాలను వాపస్ తీసుకునే హక్కు రుణగ్రహీతకు ఉంటుంది. అలాంటి మొత్తాలను సూక్ష్మరుణసంస్థలు తప్పని సరిగా రుణగ్రహీతలకు తిరిగి చెల్లించాలి.

**10.** (1) స్వయం సహాయక సంఘానికి లేదా ఆ సంఘం సభ్యులకు బ్యాంకు ద్వారా ఒక రుణం ఇచ్చి ఉంటే ఆది తీర్చకపూర్వమే, ఏ సూక్ష్మరుణసంస్థ కూడా అనుమతి లేకుండా రుణం మంజూరు చేయకూడదు. ఇలాంటి అనుమతి కోసం నిర్ధేశిత విధానంలో సంబంధిత రిజిస్టరింగ్ అధారిటీకి వ్రాతపూర్వక దరఖాస్తు చేసుకోవాలి.

స్వయం సహాయక సంఘాలకు వాటి సభ్యులకు అదనపు రుణం మంజూరుకు ముందస్తు అనుమతి

(2) ముందస్తు అనుమతి కోరుతూ వచ్చిన దరఖాస్తులు పరిశీలించేటప్పుడు సంబంధిత రిజిస్టరింగ్ అధారిటీ ఆ సూక్ష్మరుణసంస్థ నుంచి ఆ స్వయం సహాయక సంఘానికి చెందిన ప్రతి ఒక్క సభ్యురాలి వివరాలు ఈ కింది రూపంలో సేకరించాలి.

**(i)** రుణగ్రహీత పేరు

**(ii)** స్వయం సహాయక సంఘం పేరు

**(iii)** స్వయం సహాయక సంఘం రుణం తీసుకున్న బ్యాంకు పేరు.

**(iv)** బ్యాంకు రుణం, మంజూరు చేసిన తేది

**(v)** స్వయం సహాయక సంఘానికి బ్యాంకు చెల్లించిన మొత్తం

**(vi)** స్వయం సహాయక సంఘం నుంచి అందవలసిన బకాయి.

**(vii)** స్వయం సహాయక సంఘం తాజాగా కోరుతున్న రుణం మొత్తం.

(viii) స్వయం సహాయక సంఘం రుణం చెల్లింపు సామర్థ్యంతో పాటుగా రుణం ఏ ప్రయోజనం నిమిత్తం ఇచ్చారో తెలియచేసే వివరాలు.

(ix) ఇంకా ఇతర నిర్దేశిత వివరాలు

(3) అదనపు రుణానికి సంబంధించిన అనుమతి కోసం తమ ముందుకు వచ్చిన దరఖాస్తులను రిజిస్టరింగ్ అధారిటీ దరఖాస్తు స్వీకరించిన తేదీ నుంచి 15 రోజులలోగా సబ్ సెక్షన్ (2) కింద దర్యాప్తు జరిపించి, సంతృప్తి చెందితే అనుమతి మంజూరు చేయవచ్చు. స్వయం సహాయక సంఘాల సభ్యులు అదనపు రుణానికి సంబంధించిన షరతులను, రుణం చెల్లింపునకు సంబంధించిన నిబంధనలను, తమ బృందంతో చర్చించి అర్ధంచేసుకొని తీర్మానం చేశారోలేదో రిజిస్టరింగ్ అధారిటీ ధ్రువీకరించుకోవాలి. అలాగే ఈ అదనపు రుణం దానిపైగల బాధ్యతలు నిర్వర్తించడానికి అవసరం అయిన అదనపు ఆదాయం స్వయం సహాయక సంఘానికి సమకూర్చి పెడుతుందని వారు సంతృప్తిచెందగలగాలి.

(4) ఏ సూక్ష్మరుణసంస్థ కూడా ఏ స్వయం సహాయక సంఘం సభ్యురాలికి కూడా రెండు రుణాలు ఉండగా మరో రుణం మంజూరు చేయకూడదు. అవి అంతకు ముందు ఎక్కడ నుంచి తీసుకున్నారన్న దానితో నిమిత్తం లేదు.

**11.** (1) ఒక స్వయం సహాయక సంఘ సభ్యురాలు ఏదైనా సూక్ష్మరుణసంస్థ నుంచి తీసుకునే రుణాలన్ని ఆర్డినెన్స్‌లో నిర్దేశించిన నమూనా ఫార్మాట్‌లో మాత్రమే ఒప్పందం కావాలి.

(2) ప్రతీ సూక్ష్మరుణసంస్థ క్యాష్ పుస్తకము, లెడ్జర్ పుస్తకము ఇతర సంబంధిత రికార్డులు నిర్ధేశించిన విధానం లేదా నమూనాలోనే నిర్వహించాలి.

(3) ప్రతీ సూక్ష్మరుణసంస్థ తప్పనిసరిగా,-

ఎ. రుణం ఇచ్చినా లేదా ఇవ్వబోయే రోజు నుంచి ఏడు రోజుల్లోగా రుణానికి సంబంధించిన నియమ నిబంధనలు, రుణం మంజూరు చేసిన తేదీ, దాని ముగింపు గడువు, సూక్ష్మరుణసంస్థకి సంబంధించిన అధికారి పేరు, చిరునామా, వసూలు చేసే వడ్డీ వంటి వివరాలను నిర్దేశిత నమూనాలో రుణగ్రహీతకు పంపించాలి.

బి. రుణం మొత్తం చెల్లింపు అయిన అనంతరం ఆ రుణం బకాయి తీరిపోయిందంటూ ప్రతీ ఒక్క పేపర్‌పై అక్షరాల చెల్లించినట్టు రుణగ్రహీత చేత సంతకం చేయించుకుని సూక్ష్మరుణసంస్థ తన వద్ద ఉంచుకోవాలి. దాని ప్రతులను రుణగ్రహీతకు కూడా అందచేయాలి.

(4) ఏ సూక్ష్మరుణసంస్థ కూడా అధికృతంగా సంతకం చేసిన రసీదు ఇవ్వకుండా ఏ రుణగ్రహీత నుంచి ఎలాంటి రుణానికి సంబంధించిన మొత్తం వసూలు చేయకూడదు.

(5) ఏ సూక్ష్మరుణసంస్థ అయినా రుణ గ్రహీతలు లిఖిత పూర్వకంగా కోరినట్టయితే వారికి లేదా వారి ప్రతినిధులకు ఖాతాపత్రాల ప్రతులను అందచేయాలి.

ఈ ఆర్డినెన్స్ జారీకి ముందు మంజూరు చేసిన రుణాల విషయంలో ఏవైనా సెక్యూరిటీలు తీసుకున్నట్టయితే ఆ వివరాలు కూడా తప్పనిసరిగా తెలియచేయాలి.

(6) అన్ని వాయిదా చెల్లింపులను ఆయా స్వయం సహాయక సంఘాలు లేదా వాటి సభ్యులు తమ పంచాయితీ కార్యాలయంలో మాత్రమే చేయాలి.

**ఎంఎఫ్ఏల నుంచి నెలవారి స్టేట్‌మెంట్లు దాఖలు**

(7) రుణ గ్రహీతల నుంచి బకాయిల వసూలు కోసం సూక్ష్మరుణసంస్థలు ఏజెంట్లను నియమించకూడదు. సూక్ష్మరుణసంస్థగాని, ఆ సంస్థ ఏజెంట్లు గాని ఎటువంటి వేధింపులకు బలవంతపు విధానాలకు పాల్పడ కూడదు. రుణం వసూలు కోసం రుణ గ్రహీత ఇంటికి వెళ్లడంతో సహా ఎలాంటి నిర్బంధ, బలవంతపు వసూలు విధానాలకు పాల్పడినా ఆర్డినెన్స్ నిబంధనల ప్రకారం శిక్షార్హం అవుతుంది. సెక్షన్ 5 ప్రకారం ఆ సూక్ష్మరుణసంస్థ లైసెన్స్‌ను రద్దుచేయడానికి రిజిస్టరింగ్ అథారిటీకి అధికారం ఉంది.

**రికార్డులు పత్రాలను అడిగే అధికారం**

**12.** ప్రతి సూక్ష్మరుణసంస్థ ప్రతి నెల 10వ తేదీలోపల రిజిస్టరింగ్ అథారిటీకి రుణ గ్రహీతల జాబితా, వారికి ఇచ్చిన రుణం, రుణం చెల్లింపుపై వారి నుంచి వసూలు చేస్తున్న వడ్డీ వివరాలు దాఖలు చేయాలి.

**కార్యాలయ ప్రవేశం తనిఖీ మరియు స్వాధీనం అధికారం**

**13.** (1) రిజిస్టరింగ్ అథారిటీ లేదా వారిచే తన తరపున నియమితుడైన అధికారి ఆర్డినెన్స్‌లోని నిబంధనల ప్రకారం సూక్ష్మరుణసంస్థల వ్యాపారం ఆర్డినెన్స్ నిబంధనల ప్రకారమే నడుస్తున్నదో లేదో తనిఖీ చేయవచ్చును. సూక్ష్మరుణసంస్థ కార్యాలయంలోకి ప్రవేశించవచ్చును. ఆ సంస్థలో రుణాలు మంజూరు చేసే బాధ్యతలు నిర్వహిస్తున్న అధికారులను పిలిపించి తాను అవసరం అని భావిస్తున్న రికార్డు లేదా పత్రం సమర్పించాలని కోరవచ్చును. ప్రతీ ఒక్క సూక్ష్మరుణసంస్థ ఇలాంటి తనిఖీలకు సహకరించి అధికారులు కోరిన పత్రాలను తప్పనిసరిగా సమర్పించాలి.

**కేంద్ర చట్టం 2 – 1974**

(2) రిజిస్టరింగ్ అథారిటీ సబ్ సెక్షన్ (1) ప్రకారం ఏ సూక్ష్మరుణసంస్థ కార్యాలయాన్ని అయినా సోదాచేసి తాను అవసరం అనుకున్న రికార్డులు లేదా పత్రాలు స్వాధీనం చేసుకొని తన పరిశీలనకు లేదా విచారణకు లేదా చట్టపరమైన చర్యలు తీసుకోవడానికి అవసరమైనంత కాలం తన ఆధీనంలో ఉంచుకోవచ్చును.

**ఫిర్యాదులు**

అయితే ఇలాంటి సోదాలు లేదా స్వాధీనాలు 1973 క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ 100, 102 సెక్షన్లలోని నిబంధనలకు లోబడి ఉండాలి.

(3) సూక్ష్మరుణసంస్థను, తమకు తగిన సమాచారం అందించగలరని భావిస్తున్న సంస్థ ప్రతినిధిని లేదా అధికారిని పిలిపించి ప్రశ్నించే అధికారం సబ్ సెక్షన్ (1) కింద రిజిస్టరింగ్ అధికారికి లేదా ఆయనచే నియమితుడైన అధికారికి ఉంటుంది.

**వివాదాల పరిష్కారం**

**14.** ఏసూక్ష్మరుణసంస్థ అయినా ఈ ఆర్డినెన్స్‌లోని నిబంధనలు ఉల్లంఘిస్తున్నట్లయితే, దానిపై ఏ స్వయం సహాయక సంఘం అయినా లేదా దాని సభ్యులైనా లేదా ప్రజలు నుంచి ఎవరైనా ఆ ఉల్లంఘనపై రిజిస్టరింగ్ అథారిటీకి ఫిర్యాదు చేయవచ్చును. ఆ అభియోగాలపై వివరణ ఇచ్చుకునే అవకాశం సూక్ష్మరుణసంస్థకి ఇచ్చిన అనంతరం రిజిస్టరింగ్ అధికారి ఆ ఫిర్యాదుపై దర్యాప్తు జరిపి అర్డినెన్స్‌లోని సెక్షన్ 5కి అనుగుణంగా తగు ఆదేశాలు జారీచేయవచ్చు.

**15** (1) సూక్ష్మరుణసంస్థలకు స్వయం సహయక సంఘాలకు మధ్య, స్వయం సహాయక సంఘాల సభ్యులకు సూక్ష్మరుణసంస్థలకు మధ్య లేదా స్వయం సహాయక సంఘాలకు వాటి సభ్యులకు మధ్య ఈ ఆర్డినెన్స్ క్రింద పేర్కొన్న స్వయం సహాయక సంఘాలకు వారి సభ్యులకు మంజూరు చేసిన రుణాలకు సంబంధించిన సివిల్ స్వభావం గల వివాదాలను పరిష్కరించుటకు, రుణగ్రస్తులను రక్షించేందుకు హైకోర్టును సంప్రదించి రాష్ట్రప్రభుత్వం తన ఉత్తర్వుల ద్వారా...

ఎ. ఈ ఆర్డినెన్స్ అమలులోకి వచ్చిన వెంటనే రాష్ట్రంలోని ప్రతి జిల్లాకు ఒక త్వరితగతి విచారణ కోర్టును (ఫాస్ట్ ట్రాక్ కోర్టు) ఏర్పాటు చేయవచ్చును.

**కేంద్ర చట్టం 5 - 1908**

బి. అవసరమని భావించిన యడల రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలలో కూడా అట్టి త్వరితగతి విచారణ కోర్టులను ప్రారంభించవచ్చును.

(2) ఆంధ్రప్రదేశ్ హైకోర్టు వారిని సంప్రదించి ప్రభుత్వం తన ఉత్తర్వుల ద్వారా త్వరితగతి కోర్టులకు సంబంధించిన పరిధిని నిర్ణయించవచ్చును లేదా ఎప్పుడైనా సదరు పరిధిలను పెంచవచ్చును, లేదా మార్చవచ్చును.

**సూక్ష్మరుణ సంస్థల వేదింపులకు జరిమాన**

(3) త్వరితగతి విచారణ కోర్టులలో సమర్పించిన వివాదాలను మూడు నెలల కాల పరిధిలో పరిష్కరించవలెను.

(4) త్వరితగతి విచారణ కోర్టులు ఇచ్చే తీర్పులు సివిల్ ప్రొసీజర్ కోడ్ 1908లోని నిబంధనలకు లోబడి ఉండాలి.

16 (1) సూక్ష్మరుణ సంస్థ రోజువారి వ్యాపారం నడిపే వారు మరియు వ్యాపార నిర్వహణకు సంబంధించిన వ్యక్తులు అనగా భాగస్వాములు, డైరెక్టర్లు, ఉద్యోగులు ఎవరైనా స్వయం సహాయక సంఘాల వారిని లేదా వారి సభ్యులను లేదా వారి కుటుంబ సభ్యులను బలవంతపు చర్యలకు, వేధింపులకు గురిచేసినట్లయితే అటువంటి వారికి మూడు సంవత్సరాల వరకు కారాగార శిక్ష లేదా లక్ష రూపాయల వరకు జరిమానా లేదా రెండు విధించవచ్చును.

**వివరణ :** ఈ నిబంధనకు సంబంధించి సూక్ష్మరుణ సంస్థలు స్వయం సహాయక సంఘాలను వాటి సభ్యులను లేదా వారి కుటుంబ సభ్యులను వేధింపులకు గురిచేసే "బలవంత చర్యలు" అనగా ఈ క్రింది చర్యలు.

ఎ. రుణ గ్రహీతను లేదా వారి కుటుంబ సభ్యులను అవమానించటానికి లేదా భయ పెట్టడానికి వారిని ఆటంక పరచటం లేదా హింసకు పాల్పడటం.

బి. రుణగ్రహీతలను, వారి కుటుంబ సభ్యులను వారి వారి పనులను చేసుకోకుండా ఆటంక పరచటం లేదా వారి ఆధీనంలో ఉన్న ఆస్తులలో జోక్యం కలుగజేసుకోవటం లేదా వారి ఆస్తులు కోల్పోయేలాగున చేయ్యటం లేదా వారి ఆస్తులను వారు వాడుకోకుండా ఆటంకం కలిగించటం లేదా రుణగ్రహీతలను వారి కుటుంబ సభ్యులను విడవకుండా వెంటపడి వారు వెళ్ళే ప్రతి ప్రదేశంలో అనుసరించటం.

సి. వారు నివాసం ఉండే ప్రాంతాలకు లేదా వారు వ్యాపారం చేసుకునే ప్రదేశాలకు లేదా పనులు చేసుకొనే ప్రాంతాలకు తరచుగా రావటం.

డి. రుణగ్రహీతను లేదా వారి కుటుంబ సభ్యులను ఇబ్బంది పెట్టే లేదా బాధపట్టే చర్యలు చెయ్యటం.

ఇ. ఆ వ్యక్తికి లేదా అతని ఆస్తులకు ప్రమాదం కలిగించే రీతిన చర్యలు చేయటం.

ఎఫ్. ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధి పొందేందుకు ఉపయోగపడే పత్రాలను బలవంతంగా తీసుకొని వెళ్లటం.

రిజిస్ట్రేషన్ లేకుండా వ్యాపారం సాగిస్తే జరిమానా

ఒక వ్యక్తి ఏదైనా సమాచారం అందించుటకు లేదా తీసుకొనుటకు ఇండ్లకు లేక ప్రదేశాలకు వస్తే అది ఉప నిబంధన (సి)లో చెప్పబడిన "బలవంత చర్య"గా భావించకూడదు.

(2) సూక్ష్మరుణసంస్థ లేదా సబ్ సెక్షన్ నిబంధన (1)లో పేర్కొన్న వేధింపులకు పాల్పడిన వ్యక్తులను ఎవరినైనా ఈ ఆర్డినెన్స్‌లోని నిబంధనల ప్రకారం విచారణ చేయాలి.

(3) నేర విచారణ స్మృతి–1973లోని నిబంధనల ప్రకారమే త్వరితగతి విచారణ కోర్టులు విచారణ జరుపవచ్చును. ఈ నిబంధనల ప్రకారం త్వరితగతి విచారణ కోర్టును న్యాయమూర్తిగా భావించవలెను.

**ఆర్డినెన్స్ నిబంధనల ఉల్లంఘనకు జరిమానా**

**17.** సూక్ష్మరుణ సంస్థ రోజువారి వ్యాపారం నడిపే వారు మరియు వ్యాపార నిర్వహణకు సంబంధించిన వ్యక్తులు అనగా భాగస్వాములు, డైరెక్టర్లు ఎవరైనా నిబంధన 3 ప్రకారం రిజిస్ట్రేషన్ అధారిటీ వద్ద నమోదు లేకుండా రుణాలు ఇచ్చినట్లయితే లేదా నిబంధన 10లోని ఉప నిబంధన (1) లేదా (4)కు విరుద్ధంగా ముందస్తు అనుమతి లేకుండా మరో రుణం మంజూరు చేసినట్లయితే, వారికి మూడు సంవత్సరాల వరకు కారాగారశిక్ష, లేదా లక్ష రూపాయల వరకు జరిమానా విధించవచ్చును.

**ప్రతి అధికారి ప్రభుత్వ అధికారిగానే పరిగణన**

**18** ఈ ఆర్డినెన్స్‌లోని నిబంధన 3 లేదా నిబంధన 16 కాకుండా ఇతర నిబంధనలను అతిక్రమించిన ఎవరికైనా 6 మాసాల కారగారశిక్ష లేదా 10,000 రూపాయల జరిమానా లేదా రెండింటిని విధించవచ్చును.

**కొన్ని చర్యలపై నిషేధం**

**19** ఈ ఆర్డినెన్స్‌లోని నిబంధనల ప్రకారం పనిచేసే ప్రతి ప్రభుత్వ ఆధికారి భారత శిక్షాస్మృతిలోని నిబంధన 21 ప్రకారం "ప్రభుత్వ అధికారి"గా పరిగణింప బడతారు.

**ఇబ్బందులు తొలగించే అధికారం**

**20** (1) ఈ ఆర్డినెన్స్ ప్రకారం చర్యలు తీసుకొనే లేదా తీసుకోబోయే ప్రభుత్వ అధికారి లేదా ఉద్యోగిపై ప్రభుత్వం నుంచి మందస్తు అనుమతులు లేకుండా ఎటువంటి విచారణ, వివాదం, ఇతర చర్యలు చేయకూడదు.

**మార్గ దర్శకాలు ఇచ్చే అధికారం**

(2) ఈ ఆర్డినెన్స్ ప్రకారం సదుద్దేశంతో చేసిన లేదా చేయతలపెట్టిన చర్యలకు సంబంధించి ఏ వ్యక్తిపైన ఎటువంటి విచారణ లేదా న్యాయ ప్రక్రియ చేపట్టకూడదు.

**21** ఈ ఆర్డినెన్స్ నిబంధనల అమల్లో ఏమైన ఇబ్బందులు తలెత్తిన ఎడల ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేయడం ద్వారా వాటిని తొలగించవచ్చును. నోటిఫికేషన్ అంశాలు ఈ ఆర్డినెన్స్‌లోని నిబంధనలకు విరుద్ధంగా ఉండరాదు. కానీ ఇవి ప్రభుత్వం తప్పనిసరి అని భావించినవిగా లేదా త్వరితగతిన సదరు ఇబ్బందిని తొలగించటానికి అవసరమైనవిగా ఉండాలి.

**నిబంధనావళి రూపకల్పనకు అధికారం**

**22.** ప్రభుత్వం ఈ ఆర్డినెన్స్ అంశాలకు విరుద్ధం కాకుండా ఎప్పటికప్పుడు ఈ ఆర్డినెన్స్‌ను అమలు చేసే అధికారులకు ఉత్తర్వులు, సూచనలు, మార్గదర్శకాలు చేయవచ్చును. సదరు అధికారులు మరియు ఇతర ఉద్యోగులు ఈ ఆర్డినెన్స్ అమలుకు తప్పని సరిగా సదరు ఉత్తర్వులు, సూచనలు, మార్గదర్శకాలు పాటించాలి.

ఆర్డినెన్స్ నిర్వహణపై వార్షిక నివేదిక

**23.** (1) రాష్ట్ర ప్రభుత్వం ఈ ఆర్డినెన్స్ ప్రయోజనాన్ని నేరవేర్చేందుకు అమలు పరచటానికి నిబంధనావళిని రూపొందించ వచ్చును.

(2) ఈ ఆర్డినెన్స్ ప్రకారం చేసిన ప్రతి నిబంధనను, నిబంధన చేసిన వెంటనే రాష్ట్ర శాసనసభ ముందుంచాలి. ఒక వేళ శాసనసభ సమావేశంలో లేకుంటే, సమావేశం అయిన వెంటనే 14 రోజుల లోపల ప్రవేశపెట్టాలి. మరియు ఒకటి లేదా రెండు సమావేశాలలో సమావేశం ముగింపులోపల ప్రవేశ పెట్టాలి. ఒకవేళ ఏదైనా నిబంధనను మార్చినట్లయితే లేదా తొలగించినట్లయితే సదరు మార్పు తిరిగి ప్రకటించిన తేదిన అమలులోకి వస్తుంది. ఎది ఏమైనా సదరు మార్పు అంతకు పూర్వం తీసుకొన్న చర్యలకు ఎటువంటి సంబంధం ఉండదు మరియు వర్తించదు.

**24.** ప్రభుత్వం ఈ ఆర్డినెన్స్ నిర్వహణకు సంబంధించి వార్షిక నివేదికను తయారుచేయాలి. సదరు వార్షిక నివేదికను రాష్ట్ర శాసన సభకు సమర్పించాలి.

**ఇ.ఎస్.ఎల్.నర్సింహన్**

ఆంధ్రప్రదేశ్ గవర్నర్

**ఎ. శంకర్ నారాయణ**

ప్రభుత్వ కార్యదర్శి

శాసన సభా వ్యవహారాలు

న్యాయ చట్ట సంబంధిత శాఖ

# ఆంధ్రప్రదేశ్ రాజపత్రం

పంచాయితీ రాజ్ పాలనకు సంబంధించి నోటిపికేషన్లు

**ప్రభుత్వ నోటిఫికేషన్ :**

పంచాయితీరాజ్ మరియు గ్రామీణాభివృద్ధి శాఖ

**గ్రామీణాభివృద్ధిశాఖ**

# ఆంధ్రప్రదేశ్ సూక్ష్మ రుణసంస్థల (రుణ వితరణ నియంత్రణ) నిబంధనావళి : 2010

(జీ.వో.ఎం.ఎస్ నెం. 356, పంచాయితీ రాజ్ మరియు గ్రామీణాభివృద్ధిశాఖ)

**గ్రామీణాభివృద్ధిశాఖ 19 అక్టోబర్, 2010**

ఆంధ్రప్రదేశ్ సూక్ష్మరుణసంస్థలు (రుణ వితరణ నియంత్రణ)

నియమావళి, అధికార శాసనం-2010 (ఆంధ్రప్రదేశ్ అధికార శాసనం 2010 సంఖ్య-9) లోని సబ్ సెక్షన్ 23 పరిధిలోని ఉప సెక్షన్ -1 కింద అధికారాల ప్రకారం ఆంధ్రప్రదేశ్ గవర్నర్ ఈ క్రింది నిబంధనలను రూపొందించారు.

***<u>నిబంధనలు :</u>***

**1. సంక్షిప్తనామం - అమలు**

1. ఈ నిబంధనలను ఆంధ్రప్రదేశ్ సూక్ష్మ రుణసంస్థలు (రుణ వితరణ నియంత్రణ) నిబంధనావళిగా పిలవచ్చును.
2. ఆంధ్రప్రదేశ్ అధికార రాజపత్రంలో ప్రచురితమైన తేదీ నుంచి ఈ నిబంధనలు అమలులోకి వస్తాయి.

**2. నిర్వచనాలు**

**ఈ నిబంధనల ప్రకారం అవసరమైనప్పుడు అమలుచేసే నిర్వచనం**

ఎ. వడ్డీ రేటు అనగా 4వ ఫారంలో ప్రత్యేకంగా పేర్కొన్న 17వ సూత్రంలో పేర్కొన్న వడ్డీరేటుగానే ఉంటుంది.

బి. ఫారం అంటే ఈ నిబంధనలకు అనుబంధంగా జత చేసినవి.

సి. అధికార శాసనం లేదా ఆర్డినెన్స్ అంటే సూక్ష్మ రుణసంస్థలు (రుణ వితరణ నియంత్రణ) అధికార శాసనం 2010.

డి. తాకట్టు అంటే రేషన్ కార్డు, ఆరోగ్య భీమాకార్డులు, ఆస్తియాజమాన్యపత్రాలు, గృహోపకరణ వస్తువులు, పించను కార్డులు, రుణగ్రహీతల పరస్పర హామీలు (జమానతులు), రుణగ్రహీతకు ప్రభుత్వం నుంచి లభించిన ఏ లబ్ధి అయినా తాకట్టుగానే గుర్తింపబడుతుంది.

ఇ. పట్టణస్థాయి సమాఖ్య అంటే మున్సిపాలిటీ ప్రాంతాలలో దారిద్ర్య నిర్మూలనా పథకం (మెప్మా) క్రింద మురికివాడలలో లేదా ఆవాసాలలో నిర్వహించే స్వయం సహాయకసంఘాల సమాఖ్య.

ఎఫ్. గ్రామ సంఘం అంటే గ్రామీణ పేదరిక నిర్మూలనా సంస్థ నిర్వహించే ఒక గ్రామంలోని లేదా ఆవాసంలోని స్వయం సహాయకసంఘాల సమాఖ్య.

జి. ఈ అధికార శాసనం మరియు నిబంధనావళిలో ఉపయోగించిన "పదాలు" మరియు "వ్యక్తీకరణలకు" ఈ అధికార శాసనం ద్వారా సాధించదలచిన లక్ష్యాలతో కూడిన ఏ ఇతర చట్టంలోనైనా వర్తించే అర్థమే వర్తిస్తుంది.

**3. నమోదుకు దరఖాస్తు**

అధికార శాసనం అమలు మొదలయ్యే తేదీనాటికి రాష్ట్రంలో పనిచేస్తున్న ప్రతీ సూక్ష్మరుణసంస్థ తప్పనిసరిగా గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో సబంధిత రిజిస్ట్రేషన్ అధికారులకు ఫారం -1లో వివరాలను పొందుపరచి నమోదుకు దరఖాస్తు చేసుకోవాలి.

ఒక జిల్లాలో కంటే ఎక్కువ చోట్ల పనిచేస్తున్న సూక్ష్మ రుణసంస్థలు ప్రతీ జిల్లాలో విడివిడిగా నమోదు కోసం దరఖాస్తులు చేసుకోవాలి.

**4. రిజిస్ట్రేషన్ అధికారుల తనిఖీ**

1. సూక్ష్మ రుణసంస్థ అందించిన వివరాలను నిబంధన 3 ప్రకారం సరిగా ఉన్నాయా లేదా అని రిజిస్ట్రేషన్ అధికారులు పరిశీలించాలి.
2. 3వ నిబంధన ప్రకారం దరఖాస్తు సరిగా లేకపోతే దానిని తగిన కారణాలను సూచిస్తూ సరిదిద్దేందుకు తిరిగి పంపాలి.
3. 3వ నిబంధన ప్రకారం దరఖాస్తు సరిగా ఉన్నట్లయితే దానిలో పేర్కొన్న వివరాలను గ్రామం లేదా మున్సిపల్ వార్డుల్లో గ్రామ సంఘం మరియు పట్టణస్థాయి సమాఖ్య కార్యాలయాల్లో సమాచారం ఇచ్చే నిమిత్తము మరియు వారి నుంచి తిరిగి సమాచారం ఏదైనా ఉంటే తీసుకునేందుకు వీలుగా ప్రచురించాలి.

**5. తప్పు సమాచారం ఇస్తే ఎదురయ్యే పర్యావసనాలు**

ఫారం -1లో పొందుపరచిన సమాచారం ఏదైనా తప్పుగా ఉంటే రిజిస్ట్రేషన్ అధికారులు భారత శిక్షాస్మృతి 1860 క్రింద సంబంధిత నిబంధనల ప్రకారం విచారణ ప్రారంభించవచ్చును.

**6. రిజిస్ట్రేషన్ పొందపోయేముందు సూక్ష్మ రుణ సంస్థ ఇవ్వవలసిన పూచీకత్తు**

ప్రతీ సూక్ష్మరుణసంస్థ ఫారం-2లో పూచీకత్తు సమర్పించాలి. ఈ పూచీకత్తుపై సూక్ష్మరుణసంస్థకు చెందిన ముఖ్య కార్యనిర్వహణాధికారి లేదా తత్సమాన అధికారి సంతకము చేయాలి.

**7. రిజిస్ట్రేషన్‌కు కాల పరిమితి**

నిబంధనావళిలోని 3,6 నిబంధనల ప్రకారం సూక్ష్మ రుణసంస్థలు సమర్పించిన వివరాలు సరిగా ఉన్నట్లైతే, సూక్ష్మరుణసంస్థలు ఫారం-1, మరియు ఫారం-2 సమర్పించిన ఏడు పని దినాలలోపల, ఫారం-3లో రిజిస్ట్రేషన్ పత్రం జారీచేయాలి.

**8. రిజిస్ట్రేషన్ కొనసాగింపు**

1. పైన చెప్పిన విధంగా రిజిస్ట్రేషన్ చేసుకున్న ప్రతి సూక్ష్మ రుణసంస్థ ఒక సంవత్సరం తర్వాత కూడా తన వడ్డీ వ్యాపారాన్ని కొనసాగించదలచుకుంటే, ఆర్డినెన్స్‌లోని సెక్షన్-3లోని 4వ ఉపసెక్షన్ ప్రకారం ఫారం-4లో పేరు వారిగా రుణగ్రహీతల వివరాలన్నీ పొందుపరచటంతో పాటు, ఏ రుణాన్ని ఏ ప్రయోజనం నిమిత్తం ఇచ్చారో, ఎంత వడ్డీరేటు విధించారో మొదలైన వివరాలన్ని తెలియజేయాలి.

2. కొనసాగింపును కోరుతూ వచ్చిన ప్రతి దరఖాస్తును రిజిస్ట్రేషన్ అధికారి గ్రామ సంఘాలు, పట్టణ సమాఖ్యలు లేదా అధికారి గుర్తించిన వ్యక్తి లేదా సంస్థ ద్వారా గ్రామాలలో, వార్డుల్లో ఆ సంస్థ వివరాలను ప్రచురించి, ఆ సంస్థ కొనసాగింపునకు సంబంధించి ఏమైనా అభ్యంతరాలు ఉంటే ఒక నిర్దిష్టమైన తేదీలోపల తెలియజేయవలసిందిగా కోరవచ్చును.

3. స్వయంసహాయక సంఘాలు లేదా గ్రామ సంఘాలు, లేదా పట్టణ సమాఖ్యల నుంచి అందిన అభ్యంతరాలను రిజిస్ట్రేషన్ అధికారి పరిశీలించి సూక్ష్మరుణ సంస్థలకు సంబంధించిన అధికార శాసనం నిబంధనలకు అవి లోబడి ఉన్నాయో లేదో నిర్ధారించుకోవాలి.

4. సూక్ష్మరుణసంస్థ కొనసాగింపుకోసం చేసుకున్న దరఖాస్తులో, వివరాల్లో ఏవైనా తప్పులు ఉన్నాయని, రిజిస్ట్రేషన్ అధికారి నిర్వహించిన తనిఖీలో లేదా ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదుల ద్వారా గాని తెలుసుకున్నట్లయితే సూక్ష్మరుణసంస్థ ఆర్డినెన్స్‌లోని ఏ షరతులనైనా ఉల్లంఘించినట్లు తెలుసుకుంటే రిజిస్ట్రేషన్ అధికారి వ్రాతపూర్వకంగా ఆ కారణాలను తెలియచేస్తూ కొనసాగింపును నిరాకరించవచ్చును.

5. తప్పు సమాచారం పొందుపరచిన అన్ని కేసులలో భారత శిక్షాస్మృతి 1860లోని తగిన నిబంధనల ప్రకారం రిజిస్ట్రేషన్ అధికారి విచారణ ప్రారంభించవచ్చును.

**9. జిల్లాలో పనిచేస్తున్న సూక్ష్మరుణసంస్థల రిజిస్టరు**

1. ప్రతి రిజిస్ట్రేషన్ అధికారి జిల్లాలో నమోదైన సూక్ష్మరుణ సంస్థల అన్నింటి జాబితాను ఫారం-5లో పొందుపరచి ఆఫీసు కార్యాలయ వేళలలో ప్రజలందరి తనిఖీకి అందుబాటులో ఉంచాలి.

2. ఫారం-5లోని గ్రామ పంచాయితీలకు, పట్టణ ప్రాంతాలకు సంబంధించిన సమాచారాన్ని ఏడాదికి కనీసం రెండు సార్లు సంబంధిత గ్రామపంచాయితీలు లేదా వార్డు కార్యాలయాల్లో నోటీసు బోర్డుల్లో పెట్టాలి. దానితో పాటు వెబ్‌సైట్‌లో కూడా ఈ వివరాలను ఉంచాలి.

**10. రిజిస్ట్రేషన్ రద్దు**

1. అధికార శాసనంలో పేర్కొన్న ఏ నిబంధనలను అతిక్రమించినా, అధికార శాసనాన్ని ఫారం-2లో సమర్పించిన పూచీకత్తుకు సంబంధించిన వివరాలలో లోపాలున్నా మరియు ఏ నిబంధనలను అతిక్రమించినా, సెక్షన్ -14 కింద చేసిన ఫిర్యాదులు సరైనవేనని తేలినా, సెక్షన్ 5(1) క్రింద తనకు తానుగా మరియు క్రింద పేర్కొన్న కారణాల వలన సూక్ష్మరుణసంస్థలకు జారీచేసిన రిజిస్ట్రేషన్ గుర్తింపును రద్దుచేయవచ్చును.

   ఎ) రిజిస్ట్రేషన్ కోసం చేసుకున్న దరఖాస్తులో పేర్కొన్న వడ్డీరేటు కంటే ఎక్కువ వడ్డీరేటును వసూలు చేయటం.

   బి) అధికార శాసనం క్రింద అనుమతిలేని ఏ సొమ్మునైనా లేదా ఈ శాసన నిబంధనల ప్రకారం ఇచ్చిన రుణాలపైనా అధికంగా వసూలు చేయడానికి యత్నించడం,

   సి) రిజిస్ట్రేషన్‌లో పేర్కొన్న ప్రాంతాల్లోకాక ఇతర ప్రాంతాల్లో కూడా తమ కార్యకలాపాలను నిర్వహించటం మొదలైన కారణాల వలన కూడా రిజిస్ట్రేషన్ గుర్తింపును రద్దుచేయవచ్చును.

2. సూక్ష్మరుణసంస్థల రిజిస్ట్రేషన్‌ను రద్దుచేస్తూ ఉత్తర్వులు జారీచేసేముందు సూక్ష్మరుణసంస్థకు తమ సంస్థను ఎందుకు రద్దు చేయకుడదో నోటీస్ అందిన 15 రోజుల లోపల తెలియచేయవల్సిందిగా రిజిస్ట్రేషన్ అధికారి ఒక నోటీసును జారీచేయాలి.

3. సూక్ష్మరుణ సంస్థలు తమ అభ్యంతరాలను నోటీసులో పేర్కొన్న తేదీకంటె ముందుగానే తెలియచేసినా, నిర్దేశిత తేదీకి తర్వాత తెలియచేసినా ఆర్డినెన్స్ నిబంధనలకు లోబడి రిజిస్ట్రింగ్ అధారిటీ తన ఉత్తర్వులను సూక్ష్మరుణసంస్థకు తెలియచేయాలి.

**11. రిజిస్ట్రేషన్ సస్పెన్షన్**

1. ఆర్డినెన్స్‌లోని సెక్షన్ 11లోని (7), సెక్షన్ 16లోని నిబంధనల ప్రకారం సూక్ష్మరుణ సంస్థ నేరాలకు పాల్పడినట్లయితే, దర్యాప్తు కొనసాగిస్తూ రిజిస్ట్రింగ్ అధారిటీ సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ చేయవచ్చును. అట్టి ఉత్తర్వుల జారీకి గల కారణాలను సూక్ష్మరుణసంస్థకు తెలియచేయాలి.

2. ప్రతి రిజిస్ట్రేషన్ సస్పెన్షన్ చేసిన వెంటనే 10 (2) నిబంధన ప్రకారం నోటీసు జారీ చేయాలి. మరియు దర్యాప్తును సూక్ష్మరుణసంస్థ వివరాలు అందించిన తేదీ నుంచి 15 రోజుల లోపల పూర్తిచేయాలి.

**12. రిజిస్ట్రేషన్ రద్దు లేదా కొనసాగింపుకు నిరాకరణల ప్రభావం**

నిబంధన 10 క్రింద రిజిస్ట్రేషన్ రద్దుచేసినా, నిబంధన 8 (4) ప్రకారం రిజిస్ట్రేషన్ కొనసాగింపును నిరాకరించినా ఆ సూక్ష్మరుణసంస్థ రుణగ్రహీతలకు ఎలాంటి కొత్తరుణాలు ఇవ్వరాదు. ఆర్డినెన్స్‌లోని సెక్షన్-16లోని అంశాలను దృష్టిలో ఉంచుకొని తన పాత బకాయిలను వసూలు చేసుకోవచ్చును.

**13. ద్వంద సభ్యత్వం లేదు**

1. ఒక స్వయం సహాయక సంఘంలో సభ్యత్వం కలిగిన వ్యక్తి మరొక స్వయం సహాయక సంఘంలోనూ లేదా ఏ సూక్ష్మరుణ సంస్థ రూపొందించిన బృందంలోను సభ్యత్వం కలిగి ఉండకూడదు.

2. ఇందు నిమిత్తం ప్రతి రిజిస్ట్రింగ్ అధారిటీ స్వయం సహాయక సంఘాల సభ్యులందరి వివరాలను మరియు ఆ జిల్లాలో పనిచేస్తున్న సూక్ష్మరుణసంస్థలు అందచేసిన రుణగ్రహీతల వివరాలు అన్నింటిని కలిపి ఒక సమగ్ర డాటాబేస్‌ను నిర్వహించాలి.

**14. వడ్డీరేట్ల వెల్లడి**

1. ఈ ఆర్డినెన్స్ క్రింద నమోదైన సూక్ష్మరుణసంస్థలన్ని తాము ఇచ్చిన రుణాలపై విధించిన వడ్డీరేట్లను తమ కార్యాలయాలలో ప్రముఖంగా కనపడే విధంగా ప్రచురించాలి మరియు రుణగ్రహీతలకు వ్రాతపూర్వకంగా ఆ వివరాలను అంధించాలి.

2. వడ్డీరేట్లు ఇలా ప్రముఖంగా కనపడే విధంగా ప్రచురించకపోవడం ఆర్డినెన్స్‌లోని సెక్షన్-18 ప్రకారం శిక్షార్హం

**15. అన్ని రకాల చార్జీలు వడ్డీరేటులో భాగమే**

1. సూక్ష్మరుణసంస్థ ఫారం-1 మరియు ఫారం-4లో నివేదించిన మేరకు మరియు రుణ మంజూరీ పత్రంలో పేర్కొన్న వడ్డీరేటు తప్పించి రుణగ్రహీతలపై ఏ విధమైన ఖర్చులు, చార్జీలు మోపరాదు.

2. వడ్డీరేటు మినహాయించి ఏ సూక్ష్మరుణసంస్థ ఏ ఇతర మొత్తాలను వసూలు చేయరాదు. అలా చేసినట్లయితే ఆర్డినెన్సలోని సెక్షన్-8 (2) క్రింద ఉల్లంఘనకు పాల్పడినట్లవుతుంది. సెక్షన్-18 క్రింద శిక్షార్హం అవుతుంది.

**16. కొన్ని రుణాల మొత్తం వాపస్ చేయడం**

1. ఈ నిబంధనావళికి లోబడి నమోదు చేసుకున్న సూక్ష్మరుణసంస్థలు సమర్పించిన డాటాబేస్ ఆధారంగా ప్రతి రిజిస్ట్రింగ్ అధారిటీ అప్పుతీసుకున్న మొత్తాన్ని మించి వడ్డీ కట్టిన రుణగ్రహీతలను గుర్తించాలి. ఫారం-6లో అటువంటి

రుణాల్లో సొమ్ము వాపస్ చేయాలని, రుణగ్రహీతకు తాను అసలు సొమ్ముకి మించి కట్టిన వడ్డీ మొత్తాన్ని తిరిగి చెల్లించాలని సూక్ష్మరుణసంస్థలకు ఆదేశించాలి.

2. ఇలా పైన చెప్పిన విధంగా వాపస్ చేయవల్సిన రుణాలకు సంబంధించి వసూళ్ళకు పాల్పడితే ఆర్డినెన్స్‌లోని సెక్షన్-18 క్రింద నేరం అవుతుంది. ఆర్డినెన్స్‌లోని సెక్షన్-5 ప్రకారం అటువంటి సూక్ష్మరుణసంస్థలను రద్దు చేయవచ్చును.

**17. అదనపు వసూళ్ళ కేసులో అనుసరించాల్సిన పద్ధతి**

1. సూక్ష్మరుణసంస్థ మంజూరు చేసిన రుణానికంటే అదనంగా వసూలు చేస్తున్నారని ఏమైనా ఫిర్యాదు అందితే లేదా అసలు మొత్తాన్ని మించిన వడ్డీ వసూలు చేసిన కేసుల్లోను, అలా చేసిన సంస్థకు ప్రతి రిజిస్ట్రింగ్ అథారిటీ నోటీసును జారీచేయవచ్చును. ఒక నిర్దేశిత తేదీ లోపల ఆ సంస్థ రిజిస్ట్రేషన్‌ను ఎందుకు సస్పెండ్ చేయకూడదో లేదా రద్దు చేయకూడదో లేదా కొనసాగింపును నిషేధించకూడదో తెలియచేయవల్సిందిగా ఆ సూక్ష్మరుణసంస్థలకు పంపిన నోటీసులో పేర్కొనాలి.

2. నోటీసులో పేర్కొన్న చివరి తేదీ లోపల సంస్థ అందించిన వివరణ పరిశీలించిన తర్వాత రుణగ్రహీతకు వారి నుంచి వసూలు చేసిన అదనపు మొత్తాన్ని తిరిగి చెల్లించమని ఉత్తర్వులు జారీ చేయాలి.

3. ఇలా జారీ చేసిన ఉత్తర్వులను అమలు జరపకపోయినట్లయితే ఆర్డినెన్స్‌లోని 9 ప్రకారం నేరమవుతుంది. సెక్షన్-18 ప్రకారం శిక్షార్హం అవుతుంది.

**18. స్వయం సహాయక సంఘం సభ్యులకు సూక్ష్మరుణసంస్థ రుణం మంజూరు చేయాలనుకుంటే అనుసరించాల్సిన పద్ధతి**

1. స్వయం సహాయక సంఘానికి లేదా ఆ సభ్యత్వం కలిగిన వ్యక్తికి ఇప్పటికే బ్యాంక్ నుంచి స్వయం సహాయక సంఘం ద్వారా రుణం అందివుంటే అది ఇంకా తీర్చవలసిన రుణంగానే ఉంటే అటువంటి వ్యక్తికి లేదా సంఘానికి సూక్ష్మరుణసంస్థ రుణాన్ని మంజూరు చేయాలనుకుంటే ఫారం-7లో ఆ స్వయం సహాయక సంఘం సభ్యురాలి వివరాలన్నింటిని ఆర్డినెన్స్‌లోని సెక్షన్-10 (2) ప్రకారం పొందుపరిచి ముందస్తు అనుమతికోసం దరఖాస్తు చేయాలి.

2. రిజిస్ట్రింగ్ అథారిటీ లేదా వారు నియమించిన అధికారి లేదా సంస్థ ఆ వివరాలను ఆర్డినెన్స్‌లో పేర్కొన్న గడువు లోపల స్వయం సహాయక సంఘాన్ని తనిఖీచేసి, ఈ అదనపు రుణం దానిపై గల బాధ్యతలను నిర్వర్తించడానికి అవసరం అయిన అదనపు ఆదాయం ఆ స్వయం సహాయక సంఘానికి సమకూర్చిపెడుతుందని తాను సంతృప్తి చెందాలి.

3. ఆర్డినెన్స్‌లోని సెక్షన్ 10 (3) క్రింద ఈ మందస్తు అనుమతిని ఫారం-8లో ఇవ్వాలి.

**19. అనేక రుణాల మంజూరీ నేరం**

ఏ సూక్ష్మరుణసంస్థ అయినా ఏ స్వయం సహాయక సంఘానికి లేదా ఆ సంఘం సభ్యులకు ఇప్పటికే తీర్చవలసిన రుణాలు ఉన్నప్పుడు సెక్షన్-10 ప్రకారం ఆమోదించిన రుణాన్ని మినహాయించి అదనంగా రుణం మంజూరుచేస్తే ఆర్డినెన్స్‌లోని సెక్షన్-18 ప్రకారం శిక్షార్హం అవుతుంది.

**20. రుణం రూపం, ఇచ్చే విధానం మరియు ఫార్మాట్**

1. సూక్ష్మరుణసంస్థకు రుణగ్రహీతకు మధ్య ఒప్పందమైన రుణం తిరిగి చెల్లింపు ఈ క్రింద పేర్కొన్న విధంగా ఉండాలి.
   - ఎ. రుణంచెల్లింపు వాయిదా కాలపరిమితి ఒక నెలకంటే తక్కువగా ఉండకూడదు.
   - బి. వడ్డీరేటును ఎప్పటికప్పుడు కట్టాల్సిన అసలు మొత్తానికే (డిమినిషింగ్ పద్ధతి) వర్తించాలి.
   - సి. పైన చెప్పిన పద్ధతిలో లెక్కగట్టిన సమవాయిదాల మొత్తాలను గురించి, రుణానికి సంబంధించిన ఇతర షరతులు రుణగ్రహీతకు తెలియచేసినట్లుగా రుణగ్రహీత నుంచి తగిన ఎక్‌నాలెడ్జిమెంట్ సమర్పించాలి.
2. ఈ రుణ ధృవీకరణ పత్రం ఫారం-9లో ఉండాలి.

**21. రుణం చెల్లింపులకు రశీదులు ఇవ్వాలి**

రుణగ్రహీత నుంచి తీసుకున్న ప్రతి చెల్లింపు మొత్తాన్ని ఎక్‌నాలెడ్జిమెంట్ చేస్తూ వ్రాత పూర్వకంగా సూక్ష్మరుణసంస్థ ఒక రశీదును ఇవ్వాలి. అటువంటి రశీదు ప్రతిని తమ రికార్డుల్లో కూడా ఉంచాలి.

**22. రుణ గ్రహీతకు అకౌంట్ స్టేట్‌మెంట్‌ను ఇవ్వడం**

రుణగ్రహీత కోరితే సూక్ష్మరుణసంస్థ ఉచితంగా వారి ఖాతా పత్రాన్ని (అకౌంట్ స్టేట్‌మెంట్‌ను) ఇవ్వాలి.

**23. పట్టణప్రాంతంలో చెల్లింపులు చేసే ప్రదేశం**

పట్టణప్రాంతాల్లో రుణాల వాయిదా సొమ్ము వసూళ్ళను పట్టణ సమాఖ్య ఆఫీసు లేదా వార్డు ఆఫీసు వంటి ప్రజా స్థలంలో మాత్రమే చేయాలి.

**24. సూక్ష్మరుణసంస్థ వసూలు ఏజెంట్లను నియమించరాదు**

1. రిజిస్ట్రేషన్ సమయంలో ఫారం-1లో పేర్కొన్న ఉద్యోగులు మినహాయించి రుణాల వసూళ్ళకు ఎలాంటి వసూలు ఏజెంట్లను సూక్ష్మరుణసంస్థ నియమించరాదు.
2. ఫారం-1లో పేర్కొనకుండా ఉన్న ఏ వ్యక్తి వసూళ్ళకు పాల్పడినా వారిని వసూలు ఏజెంటుగానే ఈ నిబంధన కింద గుర్తిస్తారు. సూక్ష్మరుణ సంస్థ అటువంటి వసూలుకు ఆర్డినెన్స్‌లోని సెక్షన్ -18 క్రింద బాధ్యత వహించవలసి ఉంటుంది.

**25. రిజిస్ట్రింగ్ అథారిటీకి సూక్ష్మరుణ సంస్థ సమర్పించవలసిన నెలసరి వివరాల పట్టిక**

1. ఆర్డినెన్స్‌లోని సెక్షన్-12 ప్రకారం నిబంధనల మేరకు ఫారం-10లో గత నెల మంజూరు చేసిన రుణాలు, చేసిన వసూళ్ళ వివరాలన్నీ నెలసరి పట్టికలో పొందుపరచాలి.

2. ఫారం-10 సమర్పించకపోయినట్లయితే ఆర్డినెన్స్‌లోని సెక్షన్-18 ప్రకారం శిక్షార్హం అవుతుంది.

**26. సాక్ష్యాధారాలు, పత్రాలు సమర్పించమని కోరేపద్ధతి**

ఆర్డినెన్స్‌లోని అంశాలను అమలు పరిచే నిమిత్తం, సాక్ష్యాలను పిలిచే అధికారం అవసరమైన పత్రాలను సమర్పించమని కోరే అధికారం, సాక్ష్యాలను మరియు ఇతర విచారణను రికార్డుచేసే అధికారం, రిజిస్ట్రింగ్ అథారిటీకి ఉన్నాయి. భూమి రెవిన్యూ చట్టం చాప్టర్-10లో వలనే మరియు క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ 1973 ప్రకారం రిజిస్ట్రింగ్ అథారిటీకి ఈ అధికారాలు ఉన్నాయి.

**27. సోదా మరియు స్వాధీనం చేసుకునే అధికారం**

1. ఆర్డినెన్స్‌లోని సెక్షన్-13 ప్రకారం ఆఫీస్ కార్యాలయాలల్లో రిజిస్ట్రింగ్ అథారిటీ లేదా వారిచే నియమించబడిన అధికారి సోదా నిర్వహించి అవసరమైన రికార్డులను స్వాధీనం చేసుకోవచ్చును.

2. ఫారం-11లో పేర్కొన్న విధంగా ఆ జిల్లాలోని సూక్ష్మరుణసంస్థ ప్రతినిధికి రిజిస్ట్రింగ్ అథారిటీ లేదా వారిచే నియమించబడిన అధికారి ఉత్తర్వులు జారీచేసి పిలిపించుకొనవచ్చును.

**28. ఫిర్యాదులు**

1. ఆర్డినెన్స్‌లోని సెక్షన్-14 ప్రకారం ప్రతి ఫిర్యాదును రిజిస్ట్రింగ్ అథారిటీ వ్రాతపూర్వకంగా తెలియచేయాలి లేదా ఇందుకోసం నెలకొల్పిన టోల్ ఫ్రీ టెలిఫోన్ నెంబర్ ద్వారా తెలియచేయాలి.

2. ఫిర్యాదు అందిన తేదీనుంచి 7 రోజుల లోపల రిజిస్ట్రింగ్ అథారిటీ లేదా వారిచే నియమించబడిన వ్యక్తి నమోదైన ఫిర్యాదులపై దర్యాప్తు చేయాలి.

3. అటువంటి ఫిర్యాదుపై దర్యాప్తు చేసిన తర్వాత, ఆర్డినెన్స్‌లోని అంశాలపై లేదా ఏదేని ఒక అంశంపై ఉల్లంఘన జరిగినట్లు తగిన సాక్ష్యం ఉందని రిజిస్ట్రింగ్ అథారిటీ సంతృప్తి చెందినట్లయితే, ఫారం-12లో సూక్ష్మరుణసంస్థకు నోటీసు జారీచేయాలి. నిబంధన 10 ప్రకారం చర్యతీసుకోవాలి.

**29. కేసుల విచారణ**

1. ఆర్డినెన్స్‌లోని 16, 17 సెక్షన్ల ప్రకారం ఎటువంటి నేరానికి పాల్పడినా, ఎవరి పరిధిలో ఇది జరిగిందో ఆ పరిధిలో ఉన్న పోలీస్ స్టేషన్ అధికారి తనంత తానుగా లేదా ఫిర్యాదు ఆధారంగా కేసునమోదు చేసుకొని క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ 1973 ప్రకారం చర్యలు తీసుకోవాలి.

2. ఇటువంటి కేసుల అన్నింటికి సంబంధించి దర్యాప్తు విచారణల ప్రగతి నివేదిక నెలవారీగా రిజిస్ట్రింగ్ అథారిటీకి సమర్పించాలి.